క్లుప్తంగా

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభించి క్రికెట్ ఆడుతున్న స్టాలిన్

కడియం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయ స్థాయిలో వివిధ క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా జేగురుపాడులో జరుగుతున్న క్రికెట్ పోటీలను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ క్రికెట్‌తో పాటు, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ తదితర క్రీడాంశాల్లో గ్రామ సచివాలయ స్థాయిలో మండల వ్యాప్తంగా ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట డిబ్లాకులోని కమ్యూనిటీ హాలు వద్ద శుక్రవారం మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ ఉష మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏఎన్‌ఎం లత, టీఎంవో ప్రియాంక, యూత్ మెంటర్లు టి.మరియ, టి.హేప్సిక, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు, మ్యాజిక్ బస్ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీ అందాలు అద్భుతం



కళ్యాణ్ కృష్ణకు స్వాగతం పలుకుతున్న రైతులు

కడియం: పల్ల వెంకన్న నర్సరీ అందాలు అద్భుతమని ప్రముఖ దర్శకుడు కురసాల కళ్యాణ్ కృష్ణ అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక పల్ల వెంకన్న నర్సరీని సందర్శించారు. తండ్రి సత్యనారాయణ, కుటుంబ సభ్యులతో కలిసి నర్సరీలో వివిధ రకాల మొక్కలను తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్ల వెంకన్న నర్సరీలో అరుదైన మొక్కలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. అంతకు ముందు నర్సరీ రైతులు పల్ల సత్యనారాయణమూర్తి, పల్ల సుబ్రహ్మణ్యం, పల్ల గణపతి, వెంకటేష్, వినయ్‌లు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అలాగే ప్రముఖ సినీ నటుడు రానా దగ్గుబాటి తల్లి దగ్గుబాటి లక్ష్మి కూడా పల్ల వెంకన్న నర్సరీని సందర్శించి తనకు కావాల్సిన వివిధ రకాల మొక్కలను గురించి వెంకన్న కుమారులను అడిగి తెలుసుకున్నారు.

నేడు ఘంటసాల జయంతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జ్ఞాన సరస్వతీ పీఠంలోని సరస్వతీ ఘాట్ వేదికపై గోదావరి కల్చరల్ అసోసియేషన్, రాకా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం అమర గాయకుడు, పద్మశ్రీ ఘంటసాల జయంత్యుత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల ప్రతినిధులు తెలిపారు. సమాజ హితం కోరి అనేక ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలో చైతన్య పరిచిన వేగిశెట్టి కోదండ రామారావు, జీబీ నారాయణ, ఆకుల రామచంద్రరావును సత్కరిస్తామన్నారు. అనంతరం సంగీత విభావరి ఉంటుందన్నారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఇరిగేషన్ ఎస్‌ఈ జి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు.

పన్నులు చెల్లించాలి

రాజమహేంద్రవరం సిటీ: బకాయి పన్నులు, నీటి చార్జీలు, ఖాళీ స్థలాల పన్ను, షాపు అద్దెలను తక్షణమే నగర పాలక సంస్థకు చెల్లించాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ నగరంలో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేయడం జరుగుతోందన్నారు. ఇంకా అనేక ప్రతిపాదనలు వివిధ దశలలో ఉన్నాయన్నారు. ఈ పనుల నిర్వహణకు ప్రధాన ఆదాయ వనరులను వసూలు చేయాల్సి ఉందన్నారు. రెండో అర్ధ సంవత్సరం ఆస్తి పన్నును అపరాధ రుసుము లేకుండా చెల్లించు అవకాశం ఈ నెల 31వ తేదీతో ముగుస్తుందన్నారు. చెల్లింపుదారుల సౌకర్యార్థం చివరిరోజు ఆదివారం నగరపాలక సంస్థలో స్పెషల్ కౌంటర్ తెరచి ఉంటుందన్నారు.

వృద్ధులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: పేదల ఆకలి తీర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సద్గురు ధవళేశ్వరం షిరిడీ సాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దేవత సూర్యనారాయణ అన్నారు. ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర ఆశ్రమంలో 120 మంది వృద్ధులకు అన్నదానం చేశారు. ట్రస్ట్ డైరెక్టర్ పీపీఎస్ కృష్ణారావు మాట్లాడుతూ ఈ నెలలో కస్తూర్బా స్త్రీల ఆశ్రమంలో చీరలు, దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. దేవరకొండ బాబు, సంస్థ కోశాధికారి రిముత్త వైష్ణవి, కార్యదర్శి రామ్మోహనరావు, కె.రామకృష్ణ ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా.. ఆటలన్నీ సందడిగా..

- ఉత్సాహంగా క్రీడా పోటీలు
- నగరంలోని 16 మైదానాల్లో నిర్వహణ



ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

ప్రకాశం నగర్: క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఇటీవల స్థానిక ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ కె.మాధవీలత, ఎంపీ భరత్ రామ్ సంయుక్తంగా ప్రారంభించారు. మొత్తం 47 రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో తదితర క్రీడల్లో పోటీలు జరుగుతున్నాయి. జనవరి 9 వరకూ గ్రామ, వార్డు సచివాలయల పరిధిలో, అనంతరం మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. గ్రామ, వార్డు సచివాలయల పరిధిలో మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. నగరంలోని 16 క్రీడా మైదానాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు ఆయా వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది సహాయ సహకారాలు అందిస్తున్నారు.

బహుమతులు ఇలా..

గ్రామ, మండల స్థాయిలో విజేతలుగా నిలిచి నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరచిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో జట్లకు ప్రథమ బహుమతిగా రూ.35 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు అందజేస్తారు.

బ్యాడ్మింటన్‌లో ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10.వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు ఇస్తారు. జిల్లా స్థాయిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో జట్లకు ప్రథమ బహుమతిగా రూ.60 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు అందిస్తారు. బ్యాడ్మింటన్‌లో ప్రథమ బహుమతిగా రూ.35 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు అందజేయనున్నారు.

క్రీడాభివృద్ధికి ప్రాధాన్యం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో క్రీడలకు పెద్ద పీట వేయడంతో పాటు క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారని పలువురు క్రీడా విశ్లేషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా క్రీడాప్రాధికారసంస్థ (శాప్) ఆధ్వర్యంలో ఇటీవల స్కూల్ గేమ్స్ నిర్వహించిన ప్రభుత్వం, ఇప్పుడు ఆడుదాం ఆంధ్రా పేరుతో మరో క్రీడా పోటీలను నిర్వహిస్తోంది.

పారదర్శకంగా పోటీలు

విద్యార్థుల్లో దాగిన క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా పేరుతో ఆటల పోటీలను నిర్వహిస్తోంది. కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు సూచనల మేరకు ఆయా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పోటీల నిర్వహణ ఉంటుంది. పూర్తి పారదర్శకంగా వీటిని నిర్వహిస్తున్నారు.

– డీఎం శేషగిరి, జిల్లా చీఫ్ కోచ్

కిక్ బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



కిక్ బాక్సింగ్‌లో విజయం సాధించిన విద్యార్థులు

కంబాలచెరువు: ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పాయింట్ ఫైట్ విభాగంలో చైతన్య విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆ వివరాలను రీజినల్ హెడ్ ఉదయ్ శుక్రవారం తెలిపారు. మోరంపూడిలోని ప్రైమరీ 4వ తరగతి చదువుతున్న షేక్ సనా, 3వ తరగతి చదువుతున్న షేక్ సాధిక్ కిక్ బాక్సింగ్‌లో విజయకేతనం ఎగురవేశారు. షేక్ సనా ఖేలో ఇండియా బాలికల 28 కిలోల విభాగంలో పాయింట్ ఫైట్‌లో రజత పతకం, సాధిక్ బాలురు 28 కిలోల విభాగం కిక్ బాక్సింగ్‌లో పాయింట్ ఫైట్‌లో రజత పతకాలను గెలుచుకున్నారు. వారిని విద్యాసంస్థల ఏజీఎం సురేష్, స్కూలు ఆర్ఐ రామాంజనేయులు, కోచ్ భవాని శంకర్ తదితరులు అభినందించారు.

పేదలందరికీ మరింత ఆరోగ్య భద్రత

- ఏపీజీ అండ్ బీసీ చైర్మన్ నాగేశ్వర్
- కొంతమూరులో ఆరోగ్య శ్రీకార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: అందరికీ ఆరోగ్య భద్రత పెంచే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షల వరకూ పెంచారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. కొంతమూరులో శుక్రవారం ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చందన నాగేశ్వర్ మాట్లాడుతూ వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ వర్తించేలా సీఎం జగన్ మార్పులు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ చేస్తున్నామన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీని ప్రతి పేదవాడికి మరింత చేరువ చేస్తూ అవగాహన కల్పించే ఉద్దేశంతో ఇంటింటి ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు సచివాలయ కన్వీనర్లతో కలిసి ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పైడి చిన్నారావు, కాతేరు పీహెచ్‌సీ వైద్యులు డా.జగదీష్ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి విజయా రెడ్డి, మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, మాజీ ఉప సర్పంచ్ చెరుకూరి సత్తిబాబు, సచివాలయ కన్వీనర్లు పరిమి దుర్గారావు, పిన్నమరెడ్డి సూర్యచంద్రం, వాకపల్లి సుదర్శనరావు, నల్లమిల్లి సుబ్బారావు, ఎంఎం ఆలీ, గాబ్రియల్, సుబ్బారావు, మానుకొండ శ్రీను, మహబూబ్ బాజీ, సయ్యద్ అస్లాం పాల్గొన్నారు.

చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం అవసరం

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రాజమహేంద్రి మహిళా కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ విద్యాభ్యాసంతో పాటు వ్యక్తిత్వ వికాసం అత్యంత అవసరమని, ఈ దశ విద్యార్థుల జీవితాల్లో చాలా విలువైనదన్నారు. ఆంధ్రప్రదేశ్ ర్యాగింగ్ నిషేధ చట్టం 1997, ఎన్‌డీపీఎస్ చట్టం 1985పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అందరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇతర సంబంధిత పత్రాలు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. న్యాయశాస్త్రం, చట్టాలపై విజ్ఞానం పెంపొందించేందుకు కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా గ్రంథాలయం ఏర్పాటు చేశామని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాలుర పర్యవేక్షణ గృహం సందర్శన

ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాన్ని న్యాయమూర్తి ప్రత్యూష కుమారి సందర్శించి, అక్కడి వసతులను పరిశీలించారు. ఉచిత న్యాయ సేవలు పొందడం హక్కు అని బాలురకు తెలిపారు. వారికి ఎలాంటి సమస్యలున్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ప్యానల్ లాయర్లతో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. వివిధ కేసుల్లో ఉచిత న్యాయవాదులుగా నియమించబడిన వారిని ఆయా కేసుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

కంబాలచెరువు: పాఠశాల విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదురుగా దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- ఎంపీ భరత్ రామ్
- పైపులైన్, కుళాయిల ప్రారంభం



పైపులైన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని 35, 36 వార్డుల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. గోకవరం బస్టాండ్ సమీపంలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి తుమ్మలావ సాయిబాబా గుడి వరకూ ఏర్పాటు చేసిన కొత్త పైపులైన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.40 లక్షల అంచనా వ్యయంతో కొత్త పైపులైన్ ఏర్పాటు, కుళాయి కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. చిన్నపాటి వర్షం వస్తే మోకాలి లోతు నీరు నిలిచిపోయే తుమ్మలావ ప్రాంతంలో ముంపు నివారణకు శాశ్వత పరిష్కారం చేపడుతున్నామన్నారు. తొలుత ప్రజలకు ముఖ్యమైన తాగునీటి సౌకర్యం కల్పించామని, ముంపు నివారణకు చర్యలు కూడా చేపడుతున్నామన్నారు. ఆజాద్ చౌక్, లక్ష్మీవారపుపేట, దేవీచౌక్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీటిని తుమ్మలావకు.. అక్కడ నుంచి ఎన్నార్సీపీ డ్రెయినేజీకి పంపేవారన్నారు. దానిని డైవర్ట్ చేసి దేవీ చౌక్ నుంచి గోకవరం బస్టాండు మీదుగా ఆర్యాపురం అర్బన్ బ్యాంకు మీదుగా ఎన్నార్సీపీ డ్రెయినేజీకి పంపించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వార్డ్ ఇన్‌చార్జి ప్రసాదుల హరినాథ్, నక్కా శ్రీ నగేష్, మజ్జి అప్పారావు, సప్పా ఆదినారాయణ, నందం స్వామి పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక..

నగరంలో జరుగుతున్న అభివృద్ధిని టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి వాసు జీర్ణించుకోలేక పోతున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా శ్రీనగేష్ ఎద్దేవా చేశారు. ఈట్ స్ట్రీట్ ఏర్పాటు వల్ల ఎందరో సామాన్య వ్యాపారులు గౌరవవంతమైన జీవనాన్ని గడుపుతున్నారన్నారు. అటువంటి వారి పొట్టకొట్టేందుకు టీడీపీ నేత వాసు ఉవ్విళ్లూరడం చేస్తూ, ఆయన మనస్తత్వం ఏమిటో తెలుస్తోందన్నారు. కలెక్టర్, కమిషనర్, ఎంపీ ఒక మంచి సదాశయంతో పది మందికి ఉపాధి కల్పించే దిశగా ఈట్ స్ట్రీట్ తీసుకువచ్చారన్నారు. ఇక్కడకు సమీపంలోని ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహం విద్యార్థులు కూడా పార్ట్ టైం జాబ్ చేస్తూ ఆర్థికంగా తమ తల్లిదండ్రులకు భారం కాకుండా జీవిస్తున్నారు. టీడీపీ చెందిన సిటీ ఎమ్మెల్యే ఎక్కడున్నారో కాస్త చెబితే సంతోషంగా ఉంటుందన్నారు. ప్రజలు తమ సమస్యలు చెప్పుకుందామంటే ఎమ్మెల్యే కనబడక పోవడం చాలా విచారకరమన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సక్రమంగా అందించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురగంటి సతీష్ అన్నారు. నగరంలోని బీసీ హాస్టల్, అంగన్ వాడీ కేంద్రం , ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, మున్సిపల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలును శుక్రవారం బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులతో కలసి పరిశీలించారు. జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్య సాయిరామ్ మాట్లాడుతూ సందర్శించిన కేంద్రాలలో పలు సమస్యలు గుర్తించామని, అధికారులు వాటిపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యక్షుడు పిల్లాడి రుద్రయ్య, ప్రధాన కార్యదర్శి మన్నెం శ్రీనివాస్, ధార్మిక సెల్ కన్వీనర్ చాగంటి నరసింహారావు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ: ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని జేసీ, ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్‌పర్సన్ తేజ్ భరత్ అన్నారు. ఆయన శుక్రవారం ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ బోర్డు మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుణాలు తిరిగి వసూలు చేయాలని, పూర్తి స్థాయిలో పద్దుల వసూలుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కొత్త రుణాల మంజూరులో సిబ్బందికి పలు సూచనలు చేశారు. బ్యాంకు అభివృద్ధికి మరింత కృషి చేయాలన్నారు. బ్యాంకు వ్యవస్థాపకుడు సరిపెల్ల విశ్వేశ్వర ప్రసాదరావు ఆశయాలకు అనుగుణంగా కమిటీ ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు.

వెంకాయమ్మపేట రోడ్డుకు మహర్దశ

- రూ.40 లక్షలతో పునర్నిర్మాణం
- శంకుస్థాపన చేసిన కోఆర్డినేటర్ నాగేశ్వర్



వెంకాయమ్మపేట మెయిన్ రోడ్డు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలోని వెంకాయమ్మపేట వాసులు మండల కేంద్రమైన కడియానికి వచ్చేందుకు ప్రధాన రహదారి సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ రోడ్డు పునర్నిర్మాణానికి చేసిన ప్రయత్నాలకు రకరకాల కారణాలతో ఆటంకాలు ఏర్పడ్డాయి. అయితే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వెంకాయమ్మపేటలో రూరల్ కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఇటీవల పర్యటించారు. ఈ నేపథ్యంలో స్థానికుల ద్వారా రోడ్డు సమస్య ఆయన దృష్టికి వచ్చింది. వెంటనే సమస్యపై సంబంధిత అధికారులతో చర్చించారు. రూ.40 లక్షలను కేటాయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో గుర్తించిన అన్ని అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు జరిగింది. రోడ్డు నిర్మాణానికి గురువారం జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌తో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ, బోడపాటి మూర్తి, కొత్తపల్లి శివాజీ, అయితరెడ్డి వెంకటస్వామి, దాసరి శ్రీనివాస్, గండి రమణ, రంబాల దుర్గారావు, చప్పిడి రాంబాబు, పులిదిండి రాజు, వీర్లపల్లి వెంకన్న, సాపిరెడ్డి సూరిబాబు, రాణా హరిశ్చంద్ర, ముత్యం జగదీష్ పాల్గొన్నారు.

వ్యభిచారం కేసులో నాలుగేళ్ల జైలు

రాజమహేంద్రవరం రూరల్: వ్యభిచారం కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు (కఠిన కారాగార శిక్ష), రూ.2 వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిషోర్ కుమార్, బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ విజయ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. 2019 జూన్ 8వ తేదీన పిడింగొయ్యి పంచాయతీ పరిధి అగ్రిగోల్డ్ లేఅవుట్‌లోని ఒక ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు అప్పటి బొమ్మూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.దామోదరరావు, ఎస్సై కె.జగన్‌మోహనరావు, సిబ్బందితో కలిసి దాడి చేశారు. సీతానగరం మండలం మునికూడలి గ్రామానికి చెందిన కొడమంచిలి యాకోబు, ద్వారంపూడికి చెందిన మాడెం దొరబాబు, ఒక మహిళ పట్టుబడ్డారు. మహిళను వారి బంధువులకు అప్పగించి, కొడమంచిలి యాకోబు, మాడేం దొరబాబుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. సదరు కేసు విచారణలో కొడమంచిలి యాకోబుపై నేరం రుజువు కావడంతో అతనికి నాలుగేళ్ల జైలుశిక్ష(కఠిన కారాగార శిక్ష), రూ.2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ తీర్పుఇచ్చారు. మాడెం దొరబాబుపై నేరం రుజువు కాకపోవడంతో అతడిపై కేసు కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోడి సతీష్ నాయుడు వాదనలు వినిపించారు. సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టడంలో కోర్టు హెడ్ కానిస్టేబుల్ పంపన వెంకటరమణ సహకారం అందించారు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శ

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలో మెకానిక్ షెడ్డు యజమాని కనుబొజ్జి సూర్యచంద్రాన్ని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా శుక్రవారం పరామర్శించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం మధ్యాహ్నం ఆ మెకానిక్ షెడ్డు కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల ఆస్తినష్టం సంభవించింది. ఈ మేరకు ఆ షెడ్డును ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరిశీలించారు. మండల అధికారులతో మాట్లాడి బాధితుడికి సహకారాన్ని అందించాలన్నారు. ఆయన వెంట కాపవరం సర్పంచ్ జాజుల రాము, వైఎస్సార్ సీపీ నాయకులు నీరుకొండ బాబ్జీ తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనాలు



కేవీకేలో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన రైతులు

రాజానగరం: ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, సాగులో ఖర్చులను తగ్గించడంతో పాటు ఆరోగ్యకర పంటలను పండించవచ్చని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 70 మంది రైతులు శుక్రవారం కేవీకేలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, అక్కడ జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు వారికి ప్రకృతి వ్యవసాయంలో అనుసరించాల్సిన పద్ధతులు, పెరటి తోటల పెంపకం, వాటివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అరటి తోటలలో అంతర్ పంటలుగా పసుపు, ఆకుకూరలు, కోళ్లు, మేకల పెంపకం గురించి తెలియజేశారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సందర్శకులకు వంగ, టమాటా, పచ్చిమిర్చి నారును ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సీటీఆర్ఐ శాస్త్రవేత్త ఎస్.రామకృష్ణ, ఏపీసీఎన్ఎఫ్ ప్రతినిధులు సీహెచ్.వరలక్ష్మి, సతీష్, కేవీకే వాతావరణ విభాగం ఇన్‌చార్జి దిలీప్, ఎంఏ రాజు, టి.విజయవర్ధన్, ప్రభాత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 196 మందికి ఉద్యోగాలు



నియామక పత్రాలను అందజేస్తున్న జాస్తి జనార్దనమూర్తి

రాజమహేంద్రవరం రూరల్: వికాస ఆధ్వర్యంలో స్థానిక జాస్తి బుల్లెమ్మాయి డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 196 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. వివిధ కంపెనీల మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారని, మేళాకు 313 మంది విద్యార్థినులు హాజరయ్యారన్నారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను కళాశాల కరస్పాండెంట్ జాస్తి జనార్దనమూర్తి అందజేశారు.

ఘనంగా సత్కారం

కడియం: కడియపులంక పంచాయతీ పరిధి దోసాలమ్మ కాలనీకి చెందిన కరణం దేముళ్లు ఇటీవల డాక్టర్ సాధించారు. ఈ నేపథ్యంలో ఆయనను పార్టీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఘనంగా సత్కరించారు. వెంకాయమ్మపేట పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేముళ్లను శాలువా, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.